క్లుప్తంగా

నేడు నిడమర్రులో విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: మండల కేంద్రం నిడమర్రుతో పాటు, పెదనిండ్రకొలను సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్ కో ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పెదనిండ్రకొలను సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుపై గోతుల పూడ్చివేత



గోతులను సరిచేస్తున్న దృశ్యం

గణపవరం : గణపవరం మండలం కొందేపాడు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టారు. కొందేపాడు గ్రామం నుంచి అత్తిలి వెళ్లడానికి ప్రధాన మార్గమైన కొమ్మర రోడ్డు కొంతకాలంగా గోతులు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. సర్పంచ్ శీతాలం వీరలక్ష్మి, ఉపసర్పంచ్ పుల్లయ్య నాయుడు రహదారికి మరమ్మతులు చేపట్టారు. దీనితో ప్రయాణికుల ఇబ్బందులు కొంతమేర తొలిగాయి. ఈ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో దెందులూరులోని బిషప్ జాన్ మెమోరియల్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌లోని స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ జనరల్ మేనేజర్, ఫాదర్ జీ. అమ్మన్‌రాజా అన్నారు. సోమవారం దెందులూరు ట్రెనింగ్ సెంటరులో ఆయన మాట్లాడుతూ టైలరింగ్, కంప్యూటర్, సంగీతం తదితర వృత్తి విద్యా కోర్సుల్లో నిరుద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒకేషనల్ ట్రెనింగ్ సెంటరులో సంప్రదించాలని ఫాదర్ అమ్మన్‌రాజా తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం



పూల అలంకరణలో అమ్మవార్లతో శ్రీనివాసుడు

గణపవరం : గణపవరం వెలంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం స్వామివారిని పూలతో అలంకరించి ఊరేగించారు.

ఇల్లు నిర్మించకుంటే పట్టా రద్దు

భీమడోలు : నవరత్నాలు అందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే పట్టాల రద్దుకు సిఫారసు చేస్తున్నామని ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్ అన్నారు. భీమడోలులోని దిగుడుపాటిదిబ్బలోని జగనన్న లేఅవుట్‌ను వారు పరిశీలించారు. కాలనీ ఏరియాలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్ల స్థలాల్లో ఇప్పటికీ ఇళ్లు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో అధికారులు మాట్లాడారు. ఈనెల 10వ తేదీలోగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే ఇళ్ల పట్టాలు రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. జగనన్న కాలనీకి వెళ్లే దారిలో రోడ్డును నిర్మించాలని, లేఅవుట్‌లో విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని తగు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈలు సీహెచ్ సతీష్, డి.సత్యనారాయణ, వీఆర్వోలు, గ్రామకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవుని వాక్యానుసారం నడుచుకోవాలి

భీమడోలు : విశ్వాసులు దేవుని వాక్యానుసారంగా నడుచుకోవాలని కర్నూలు సీనాయి రిట్రీట్ సెంటర్ ఫాదర్ అజేష్ అన్నారు. భీమడోలులోని ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో 36వ సజీవధారల సువార్త కూడికలు సోమవారం రెండో రోజు నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా హాజరైన అజేష్ దివ్య పూజా బలి కార్యక్రమాన్ని నిర్వహించారు. విచారణ కర్త ఫాదర్ నెల్సన్‌జాన్ అధ్యక్షత వహించారు. అజేష్ దేవుని సందేశాన్ని అందించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రాజు, ఫాదర్ జోషి, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, విశ్వాసులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

భీమడోలు : స్థానిక పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, దేవస్థానం అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 9 వేల మంది భక్తులు పాల్గొన్నారు.తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆరోగ్య రథాలు.. అపర సంజీవని

- వైద్య సేవలకు సర్కారు ఊపిరి
- ప్రజలకు విశేష సేవలందిస్తున్న 108, 104 వాహనాలు
- ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర
- అందుబాటులో ఆధునిక వైద్య పరికరాలు, సుశిక్షిత సిబ్బంది





పెదవేగి మండలంలో సేవలందిస్తున్న 108, 104 వాహనాలు

పెదవేగి: ఆపద సమయంలో ఫోన్‌చేయగానే కుయ్.. కుయ్.. అంటూవచ్చి ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తూ 108 అంబులెన్స్‌లు, పల్లె ముంగిట్లోకి వచ్చి ప్రజలకు వైద్య సేవలందించే 104 వాహనాలు అపర సంజీవనులుగా పేరొందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక 108, 104 సేవలకు ఊపిరి పోశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108, 104 సేవలను గత టీడీపీ పాలనలో పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భిణులు లేదా ప్రమాదాల్లో గాయపడినవారిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. 108 సేవలను టీడీపీ సర్కారు తీవ్రంగా నిర్లక్ష్యంచేసింది. 104 సేవలదీ ఇదే పరిస్థితి. ఫోన్ చేసినా 108 వాహనాలు సకాలంలో అందుబాటులోకి రాకపోవడంతో ప్రమాద బాధితులను, రోగులను వారి బంధువులు ఆటోల్లో ఆస్పత్రికి తరలించాల్సి వచ్చేది. ఆ సమయంలో వారు పడిన బాధలు వర్ణనాతీతం. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సేవలను సరికొత్త హంగులతో పునరుద్ధరించారు. నూతనంగా ప్రారంభించిన 108, 104 వాహనాల్లో అధునాతన పరికరాలను, సదుపాయాలను, అవసరమైన సిబ్బందిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆరోగ్య రథాలు విరివిగా అందుబాటులోకి రావడం, అవి అందిస్తున్న సేవలపై దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా చేపట్టని విధంగా సరికొత్త సంక్షేమపథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు అమలు చేస్తున్నారని, ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని, ప్రజల ప్రాణాలను కాపాడే 108, 104 వాహనాలను ప్రతి మండలానికీ కేటాయించి ప్రాణదాతగా నిలిచారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని అన్ని వర్గాల ప్రజలు అంటున్నారు. కరోనా విపత్కర సమయంలో 108, 104 సేవలను అధునాతన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావడంతో అవి ప్రజలకు విశేష సేవలందించాయి.

108 సేవలు

- ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు ఇంటికి వెళ్లి బాధితులను ఆసుపత్రికి తరలిస్తారు.
- పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి ఏలూరు జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగులను తరలించే సమయంలో వీటి పాత్ర కీలకం
- రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం, మెరుగైన చికిత్స కోసం తరలించేందుకు ఎంతగానో ఉపయోగం.
- 108 వాహనంలో నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బంది. ఆక్సిజన్ సదుపాయం అధునాతన సాంకేతికతో కూడి పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

104 సేవలు

- ఈ వాహనం మండలానికి ఒకటి కేటాయించారు.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలందించేందుకు పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ వాహనంలో వెళ్లి రోజుకో సచివాలయం సందర్శించి ఆ పరిధిలోని ప్రజలకు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు (సుగర్, బీపీ తదితర) వైద్య పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా మందులు ఇస్తారు.
- గర్భిణులు, బాలింతలకు సైతం పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.
- గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు.
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారు.

చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం



గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 108, 104 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. ఆధునిక సదుపాయాలతో వీటిని మళ్లీ ప్రారంభించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టారు.

– కేశన సతీష్, వైఎస్సార్ సీపీ, పెదవేగి మండల కన్వీనర్

ప్రజారోగ్యానికి పెద్దపీట



ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తోంది. పార్టీలకతీతంగా అన్ని వర్గాలవారికీ న్యాయం జరుగుతోంది.

– ముస్సె శ్రీను, ద్వారకాతిరుమల దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సౌకర్యాలతో 108, 104 వాహనాలను ప్రారంభించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల అమలు ఆయనకే సాధ్యం. సీఎం సహకారంతో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు మండలాల్లో రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

సందర్శించారు.. సరిచేశారు

పాఠశాలలోని సమస్యల పరిష్కారం





గ్రీన్ చాక్‌బోర్డు ఏర్పాటు, బాలికల మరుగుదొడ్లకు తలుపులు బిగించిన దృశ్యం

పెదవేగి : ఆకస్మిక తనిఖీలో భాగంగా తాళ్లగోకవరం పాఠశాలను ఎంపీడీఓ సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలను సరిచేశారు. పెదవేగి మండలం తాళ్లగోకవరం ఎంపీయూపీ పాఠశాలను పెదవేగి ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ వారం రోజుల క్రితం పరిశీలించారు. ఆ పరిశీలనలో పాఠశాలలో విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ అందించే వాటర్ ప్లాంట్ పాడైపోయిందని, బాలికల టాయిలెట్ రూముల తలుపులు ఊడిపోయాయని, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు పాడైపోయాయని గుర్తించి వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఇటీవల ఆదేశించారు. ఎంపీడీవో ఆదేశాలపై స్పందించిన విద్యా శాఖ, స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆర్వో వాటర్ ప్లాంట్‌తో పాటు, టాయిలెట్ల తలుపులు మరమ్మతులు చేశారు. తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారని ఎంపీడీవో రాజ్ మనోజ్ తెలిపారు. ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి కావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందిని అభినందించారు.

విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించాలి



బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో శేషు

గణపవరం : పదో తరగతి విద్యార్థి జీవితలో కీలకమైనదని, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు బాగా చదివి నూరుశాతం ఉత్తీర్ణులవ్వాలని గణపవరం ఎంఈవో పుచ్చల శేషు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అదనపు తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈఏడాది కూడా పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ఆరు పేపర్ల విధానం కొనసాగుతుందని, అందువల్ల విద్యార్థులు మరింత బాధ్యతగా కష్టపడి చదవాలన్నారు. ఆయా సబ్జెక్టులలో మార్కుల వెయిటేజ్ గురించి విద్యార్థులకు వివరించారు. సీ, డీ గ్రేడు విద్యార్థులకు ముఖ్యమైన, అతి ముఖ్యమైన ప్రశ్నల గురించి వివరించారు. పబ్లిక్ పరీక్షల గడువు నెల రోజులలోపు మాత్రమే ఉందని, అందువల్ల విద్యార్థులు కాలాన్ని వృధా చేయకుండా ప్రతి నిముషం విలువైనదిగా భావించి, తమ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. 40 రోజుల ప్రణాళిక అమలు తీరు పరిశీలించారు. హెచ్ఎం కె.రాంబాబు మాట్లాడు తూ పదో తరగతి విద్యార్థులకు రివిజన్ కూడా పూర్తయిందని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ, లాంగ్ పీరియడ్స్ బోధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, దేవదాసు పాల్గొన్నారు.

ముగ్గురమ్మల జాతర ప్రారంభం



పూలతో అలంకరించిన అమ్మవార్ల ఆలయాలు

గణపవరం : గణపవరం మండలం పిప్పర గ్రామ ప్రజల ఆరాధ్య దైవాలు ముగ్గురమ్మల జాతర మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామదేవతలైన మహంకాళి, మహాలక్ష్మి, బంగారుపాప అమ్మవార్లకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆలయాలను రంగులు, విద్యుత్ దీపాలంకరణలో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాలను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. జాతర ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవార్లకు గవళ్లగుడుపు సేవను వైభవంగా నిర్వహించారు. బ్యాండు మేళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, విచిత్ర వేషాలు, శక్తివేషాలు, కోయడ్యాన్సులు, కోలాటాలు, తప్పెట గుళ్లు, జానపద నృత్యాలు, బాణసంచా మోతలతో అమ్మవార్లను రాత్రంతా గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. గ్రామ ప్రజలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా పిప్పర చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దసంఖ్యలో జనం తరలిరావడంతో పిప్పర గ్రామంలోని రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి.

నేత్రపర్వం.. శివకేశవుల కల్యాణం



భీమడోలులో శివకేశవులను ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు : భీమడోలులో శివ కేశవుల కల్యాణ వేడుక ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. దేవదాయ ధర్మశాఖ పరిధిలో పురాతన ఆలయాల్లోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వర స్వామి, శ్రీవేంకటేశ్వర వార్ల కల్యాణం ఒకే ముహూర్తానికి గ్రామంలోని మండపాల వద్ద నిర్వహించారు. తొలుత శివ పార్వతులు, శ్రీవేంకటేశ్వర, పద్మావతి, అలివేలును పువ్వులతో సుందరంగా ఆలకరించారు. ముస్తాబైన స్వామి, అమ్మవార్లను పల్లకీలో పురవీధుల్లో ఊరేగింపుగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేదికల వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పండితులు బృందావన నరసింహాచార్యులు, పూజారులు ఉమా శంకర్‌శర్మ, బృందావన పవన్, శేషభట్టాచార్యులు వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు.

కాలువ గట్ల ఆక్రమణలను తొలగించండి



మాట్లాడుతున్న డీపీవో జీవీకే మల్లికార్జునరావు

ఉంగుటూరు: గోదావరి కాలువగట్టు మీద ఉన్న ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పదవ వార్డుకు జరగనున్న ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ కేంద్రాన్ని డీపీవో మల్లికార్జునరావు పరిశీలించారు. గతంలో హైస్కూల్‌లో ఉండే పోలింగు కేంద్రం పడిపోయిన క్రమంలో నెం.1 పాఠశాల తూర్పు భాగం భవనం అనుకూలంగా గుర్తించారు. ఆకేంద్రాన్ని డీపీవో పరిశీలించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ షంషుద్దీన్, విద్యుత్ ఏఈ శ్రీరామ్, ఎస్సై స్వామి, ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవం.. మల్లేశ్వరుని కల్యాణం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్ల కల్యాణం తంతును నిర్వహిస్తున్న పూజారులు

భీమడోలు : గుండుగొలనులో వేంచేసియున్న శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం రాత్రి జరిగింది. దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా ఆలకంరించి ముస్తాబు చేసారు. ఆలయ పూజారులు లంకా శ్రీనివాస్ శర్మ, లంకా శివకుమార్ శర్మ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎంపీ కోటగిరిని కలిసిన ఎంపీ మిథున్‌రెడ్డి



ఎంపీ కార్యాలయానికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ క్యాంపు కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పి. మిథున్‌రెడ్డి సోమవారం రాత్రి విచ్చేశారు. రీజనల్ కోఆర్డినేటర్‌కు ఎంపీ శ్రీధర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సమస్యలపై ఇరువురు ఎంపీలు చర్చించారు. వైఎస్సార్‌సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు మోహన్ వారి వెంట ఉన్నారు.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన ముసునూరు జెడ్పీటీసీ ప్రతాప్

దెందులూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు ఆధ్వర్యంలో ముసునూరు మండలంలో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ అన్నారు. సోమవారం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముసునూరు మండలానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి సమస్యల పరిష్కార లక్ష్యంగా ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలను ఎంపీకి ఆయన వివరించారు.

సమస్యలపై వినతుల స్వీకరణ



దెందులూరు క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహాలు, రుణాలు, వ్యక్తిగత అవసరాలు, స్వయం ఉపాధి, రేషన్ కార్డులు ఇతర అంశాలపై పలువురు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. వివరాలను ఆయన నమోదు చేసిన సంబంధిత శాఖాధికారులకు సమస్యల పరిష్కారం నిమిత్తం సిఫార్సు చేశారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

గంగన్నగూడెంలో సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇటీవల మృతి చెందిన గరిమెళ్ళ సామ్రాజ్యం ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సామ్రాజ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలా రాణి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయపాటి గణేష్, మొటపర్తి గాంధీ, ఇరుకులపాటి సాంబశివరావు, తదితరులున్నారు.

పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన అధికారులు



పోలసానిపల్లి - 2 పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవన్, తహసీల్దార్ కె.షంషూద్దీన్

భీమడోలు : పోలసానిపల్లి 12వ వార్డుసభ్యుని ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో సోమవారం ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్, తహసీల్దార్ కె.షంషూద్దీన్ పోలింగ్ స్టేషన్‌గా ఉన్న నెం.2 ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో నాడు నేడు పనులు జరుగుతున్నందున ఎన్నిక సమయానికి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పోలసానిపల్లిలోని 12వ వార్డు సభ్యుడు, ఉపసర్పంచ్ జిల్లా బాలకృష్ణ(బాలు) గతేడాది డిసెంబర్ 4న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న పంచాయతీ వార్డు సభ్యుని ఎన్నికకు అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు పోలింగ్ స్టేషన్‌గా నెం.2 ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను ఆరు ప్రదేశాల్లో ప్రచురించామని, సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ డి.సత్యనారాయణ, గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్, హెచ్ఎం మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న మంగరావు, అడపాశ్రీను

ఉంగుటూరు : నారాయణపురం గ్రామానికి చెందిన దుబాకుల వెంకట లక్ష్మికి సోమవారం వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షల చెక్కును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఉప సర్పంచ్ అడపా శ్రీనివాస్ అందజేశారు. వైఎస్సార్ బీమా త్వరగా మంజూరు కావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే వాసుబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పైడి అరుణకుమార్, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఆర్‌బీకే చైర్మెన్ మతుకుమల్లి శ్రీధర్ కుమార్, కిలపర్తి దుర్గ, లావేటి వీరాచార్యులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అలంకరణలో పెద్దింట్లమ్మ

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలోని పెద్దింట్లమ్మ వారిని లక్ష్మీదేవిగా సోమవారం అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. గణపతికి గరికతో పూజలు చేసారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేసారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి 7 గంటల నుంచి సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.